# పరాన్నజీవులు

## - ఎనుగంటి వేణుగోపాల్

"పదే పదే మీ అమ్మ జ్ఞాపకాలు నా మనోస్మృతిని కలవరపరుస్తున్నాయిరా!"

శోకం కనురెప్పల మాటు నుండి కన్నీరై రాలి పడుతుంటే విషాదపు తెరల్ని చీల్చుకుంటూ రాఘవయ్య కంఠం వణికింది.

కొడుకులిద్దరూ కూర్చున్నారు ఆయనకి ఎదురుగా. కోడళ్ళు భర్తల ప్రక్కన నిలబడ్డారు.

"ఆ దేవత లేని ఈ దేవాలయం, ఆమె లేని నేను ఊహించడానికి కష్టంగా ఉందిరా!" ముద్దముద్దగా ఉన్నాయా మాటలు.

రాఘవయ్య గుండెలో వేదన, గొంతులో ఆర్ద్రత.

మిగతావాళ్ళు కూడా విషాద వదనులై ఉన్నారు.

"భర్త మరణిస్తే భార్య తట్టుకోగలదేమోగానీ భార్యలేని ఈ ఒంటరితనాన్ని ఈ వయసులో ఏ మగాడూ భరించలేడు" పసిపిల్లాడిలా తన మనోవ్యధని వాళ్ళ ముందుంచాడు.

"అందుకేగా మామయ్యా మిమ్మల్ని మాతో వచ్చాయమంటున్నది. కంటికి రెప్పలా చూసుకుంటాం" పెద్దకోడలు అరుంధతి అంది.

"అత్తమ్మ బ్రతికున్నప్పుడే మిమ్మల్ని మా దగ్గరే ఉండమన్నాం. పుట్టిన ఊరు, పెరిగిన ఇల్లు, మా గూటిలో మేముంటాం, ఒకరికొకరం తోడు నీడై వార్ధక్యాన్ని హాయిగా గడిపేస్తామన్నారు. అత్తమ్మ లేరు. ఇప్పటికైనా మా మాట మన్నించండి" చిన్న కోడలు వేదవతి అంది.

కొడుకులు సమాధానం కోసం చూసారు.

బదులివ్వలేదాయన.

"ఉన్నది ఇద్దరం. ఎవరి దగ్గరకు వెళ్లాలని సంశయిస్తున్నట్టున్నారు. మిమ్మల్ని పోషించాల్సింది పెద్దకొడుకుగా నా బాధ్యత. నా చెంతనే ఉండండి" కలగజేసుకున్నాడు పెద్దబ్బాయి చక్రవర్తి.

చిన్నకొడుకు సురేంద్ర మౌనంగా ఉండిపోయాడు.

"మామగారి భారం మీరొక్కరే మోయడమెందుకు? చిన్నవాళ్లమైతే మాత్రం మా దగ్గర ఉండకూడదా?" వేదవతి ప్రశ్నించింది.

'నేనిప్పుడే వీళ్ళకి భారమయ్యానా?' ఆ మాటకి రాఘవయ్య మనసు చివుక్కుమంది.

"మనమధ్య వాదమెందుకు? ఓ పని చేద్దాం. చెరో ఆర్నెల్లు మామగారి బాధ్యత పంచుకుందాం. ఏ గొడవా ఉండదు" సూచించింది అరుంధతి.

మిన్ను విరిగి మీదపడ్డట్టు అదిరిపడ్డాడు రాఘవయ్య.

తల్లిదండ్రుల్ని కొడుకులు పంచుకోవడం ఇదివరకే విన్నాడు. నేడిది కొత్తేం కాదు. కానీ తనూ ఓ జడ పదార్థమై... తన పిల్లల పంపకంలో ఒక భాగమవుతానని... అసలీ మాట వాళ్ళనుండి వస్తుందని ఊహించలేదాయన.

అయినా కోడలి మాటకి ఆయన గుండె పగల్లేదు.

'రామాయణంలో ఉందా రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు దశరధుడ్ని పంచుకున్నట్టు? వ్యాస భారతం ప్రవచించిందా ధృతరాష్ట్రుడ్ని కౌరవులు వంతులవారీగా పోషించినట్టు? అసలెక్కడిదీ సంప్రదాయం? ఎవరు అంకురార్పణ చేసారీ విచిత్ర సంస్కృతికి? ఈ తరం కొడుకులకి ఎందుకు వస్తోందీ ఆలోచన కన్నవాళ్ళని పంచుకోవాలని? ఏం.. వీళ్ళు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు తల్లిదండ్రులుగా మేం పంచుకున్నామా... నువ్వు వీడ్ని బాగా చూడు, నేను వాడిని బాగా చూసుకుంటానని?' ఆలోచిస్తుంటే రాఘవయ్యకి మతిపోతోంది.

'ఈ పంపకాలు కూడా తనమీద ప్రేమతోనో, వృద్ధుడినన్న జాలితోనో కాదని, తనకొచ్చే పెన్షన్ కారణమని తెలుసు ఆయనకి. ఆ పెన్షనే రాకుంటే రెక్కలుడిగిన తనని ఈ నాలుగ్గోడల మధ్యన వదిలేసి వాళ్ళు తమ తోవ తాము చూసుకునేవారు. అలాంటప్పుడు ఎవరి పంచన చేరినా ఒకటే!' అనుకుంటూ నిట్టూర్చారాయన.

ఆయన మౌనాన్ని ఎవరూ కదపలేకపోయారు.

కాసేపు గడిచాక చక్రవర్తి అన్నాడు-

"ఏదో ఒకటి చెప్పండి నాన్నా. మిమ్మల్ని కూడా ఒంటరిగా వదిలి వెళ్లామనుకోండి. నలుగురూ నానా రకాలుగా అనుకుంటారు" అతడి కంఠంలో అసహనం.

రాఘవయ్య గుండెలో విస్ఫోటనం.

'నలుగురి కోసమా తనని చేరదీస్తున్నది?' భావోద్వేగాన్ని పెదవుల మధ్యన బిగపట్టి కనురెప్పలు మూసుకున్నాడు.

"నాన్నగారూ! మీకు చెప్పేటంతటి వాళ్ళం కాదు. మిమ్మల్ని బలవంతం చేయడం కూడా సరికాదు. మీకు అన్నీ తెలుసు. మీ మనసుకెలా తోస్తే అలా చేయండి. మీరు తీసుకునే నిర్ణయమేదైనా మాకు శిరోధార్యమే" తన అభిప్రాయం తెలిపాడు సురేంద్ర.

కళ్ళు తెరిచి "నిజమే! నా ఇష్ట ప్రకారమే జరగాలి. అందుకు గడువు కావాలి. కొంతకాలం నన్నిలా ఒంటరిగా వదిలేయండి. మళ్ళీ మీకు కబురంపుతాను. అప్పుడు నా నిర్ణయం తెలియబరుస్తాను" అన్నాడాయన.

రాఘవయ్య అభిప్రాయం తెలిసాక తమ తమ ఊళ్ళకి తిరుగుముఖం పట్టారు.

***

కొడుకులు వెళ్లిపోయాక తన చిన్ననాటి స్నేహితుడు నారాయణని కలిసాడు.

"ఒరేయ్ నారీ! నీ గతే నాకూ పట్టిందిరా" బాధగా అన్నాడు రాఘవయ్య.

"అసలు జరిగిందేమిటో వివరంగా చెప్పు" అడిగాడు నారాయణ.

"నా కొడుకులిద్దరూ నన్ను చెరో ఆర్నెల్లూ పంచుకుంటారట్రా!"

ఆయన గొంతులో వేదన.

అది విని బిగ్గరగా నవ్వాడు నారాయణ.

"ఏం వెటకారంగా ఉందా?"

"వెటకారం కాదురా రాఘవా నీమీద జాలేసి."

"జాలా?" ప్రశ్నార్థకంగా ముఖం పెట్టాడు.

"మరి! మాది ఉమ్మడి కుటుంబం కనుక మా తల్లిదండ్రులు, తమ్ముడు, నేను వేరుపడే అవకాశం రాలేదు. ఎవరు మా తల్లిదండ్రుల్ని పోషించాలి అనే సమస్యే తలెత్తలేదు. ఇక నీ తల్లిదండ్రుల్లా మీ అన్నదమ్ములకి ఆ అవకాశమే కల్పించలేదు. మధ్యలోనే పోయారు కనుక.

కానీ ఈ తరం కొడుకులు అలా కాదు. నేనొక్కడ్నే కన్నవాళ్ళని ఎందుకు భరించాలనే స్వార్ధచింతనో, వాళ్ళ ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా మన పోషణ భారమవుతుందన్న సంకుచిత తలంపో మనల్ని ఇలా ఆస్తులతోపాటుగా పంచుకునేలా చేస్తున్నాయి. అలాగేగా నా ముగ్గురు కొడుకులకి నేను తలా నాలుగు నెలలు పంచబడ్డాను"

అన్నాడు నారాయణ సన్నగా నవ్వుతూ.

ఆ నవ్వులో నిర్లిప్తత.

రాఘవయ్య స్నేహితుడ్ని గమనిస్తూ ఉండిపోయాడు.

"ఇదీ నయమే కదరా. తన్ని తరిమేయకుండా బుద్ధిగా పూటకి ఇంత తిండి పెడతామంటున్నారు" వ్యంగ్యంగా అన్నాడు మళ్ళీ నారాయణే.

నిర్వేదంగా తలూపాడు రాఘవయ్య.

"నువ్వన్నదాంట్లో నిజం లేకపోలేదురా. మన పిల్లలు మనల్ని కనీసం పంచుకోవడానికైనా సిద్ధపడ్డారు. లోకంలో ఎందరో వృద్ధులు తమ పిల్లల నిర్లక్ష్యానికి గురవుతున్నారు. మరెందరో ఆదరణ కరువై వృద్ధాశ్రమానికి తరలించబడుతున్నారు. ఆ రకంగా చూస్తే మనవాళ్ళు కొంతలో కొంత ఫర్వాలేదని సరిపుచ్చుకోవాల్సిందే మరి" అంటూ నిట్టూర్చాడు.

"సరే నీ కొడుకుల ఆంతర్యం తెలుసుకోవాలంటే ఓ పని చేయ్" అంటూ రాఘవయ్యకి ఒక ఆలోచన అందించాడు నారాయణ.

అది విని సరేనంటూ తలూపాడు రాఘవయ్య.

తన స్నేహితుడి సూచన ప్రకారం రాఘవయ్య మరోవారం గడిచాక కొడుకులిద్దరికీ కబురంపాడు వెంటనే రమ్మని!

***

భోజనాలయ్యాయి. పిల్లలు ఆడుకోవడానికి వీధిలోకి వెళ్లారు.

పెద్దవాళ్ళంతా తీరుబడిగా ముందు గదిలో కూర్చున్నారు.

"చెప్పండి నాన్నా!" కదిపాడు చక్రవర్తి.

"చెప్పడానికేముందిరా! ఆ రోజే చెబితే బాగుండదని అసలు విషయం చెప్పలేదు. ఒక యాభైవేలు అప్పు ఉందిరా. దాన్ని ముందు తీర్చాలి" అన్నాడు రాఘవయ్య మెల్లగా.

అప్పు మాట చెవిన పడగానే వెంటనే ఎవరూ మాట్లాడలేదు.

"అప్పు సంగతి ముందు చూడండి. నేనెవరి దగ్గర ఉండాలన్నది తరువాత ఆలోచిద్దాం" అందరినోమారు కలియజూస్తూ మళ్ళీ తనే అన్నాడు రాఘవయ్య.

"అప్పు గురించి అంత ఆందోళన దేనికి నాన్నా! ఈ ఇల్లు ఉందిగా... అమ్మేద్దాం" సురేంద్ర సలహా ఇచ్చాడు.

"నిజమే. ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుతో అప్పు తీర్చొచ్చు. సమస్యే ఉండదు" తమ్ముడి ప్రతిపాదనని సమర్ధించాడు చక్రవర్తి.


"కానీ నేను బ్రతికుండగా ఈ ఇల్లు అమ్మడం నాకిష్టంలేదురా. ఎందుకో మనసొప్పడంలేదు" చెప్పాడు రాఘవయ్య.


"ఎలాగూ మాతో వచ్చేవారేగా. ఇల్లు ఇక్కడ ఉండీ ఉపయోగం ఏముంటుంది? కనీసం అద్దెకి ఇద్దామన్నా ఈ పల్లెటూరిలో ఎవరూ ఉండరు. అలా ఆలోచించినా లాభంలేదు. అయినా ఈ కాలంలో ఇలాంటి సెంటిమెంట్స్ ఏమిటి మామయ్యా?" అంది పెద్దకోడలు.

ఆ మాటకి తీక్షణంగా చూసాడామెవంక. తలొంచుకుంది అరుంధతి.

తండ్రి ముఖంలోని భావాల్ని గమనించాడు సురేంద్ర.


"పెద్దవారు. మీ మాట కాదనడమెందుకు. ఆ ఇల్లు అమ్మవద్దులే నాన్నా. ఆ యాభై వేలేవో





## మనీషా కొత్త వెంచర్

మనీషా కొయిరాలా కొత్త వెంచర్ ప్రారంభించింది. ఎప్పటినుంచో సినిమా ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్న సోదరుడు సిద్ధార్థ్ కోసం ఆమె ఓ సినిమా నిర్మాణాన్ని చేపట్టింది. 'రాజా దిల్ కా గులాం' పేరుతో నిర్మిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ సరసన సోనాలీకులకర్ణి నటిస్తోంది. ఎన్నాళ్లనించో అనుకుంటున్నా తన కోరిక ఇప్పటికి తీరనుండడంతో సిద్ధార్థ్ ఆనందంతో ఉరకలేస్తున్నాడు. ఈ సినిమా సక్సెస్ అయితే మనీషా, ఆమె సోదరున్ని పట్టుకోగలమా అంటున్నారంతా. గత నాలు గేళ్ళుగా బాలీవుడ్ ప్రవేశం కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన సిద్ధార్థ్ ఇప్పుడు నటనపైనే దృష్టిసారిస్తానంటున్నాడు. సోదరిలా వివాదాలకు లోనుకాకుండా సక్సెస్ సాధించాలని అంతా కోరుకుంటున్నారు. బెస్టాఫ్‌లక్ సిద్దూ!




అన్నయ్యా, నేను కల్సి కడతాం. మీరేం వర్రీ కాకండి'' అనునయంగా అన్నాడు సురేంద్ర.

చేతి నుండి డబ్బు కట్టడం అనేసరికి చక్రవర్తికి కుతకుతలాడింది. తమ్ముడు అన్నది రుచించ లేదు.

"తల్లిదండ్రులు తన పిల్లలకి ఆస్తుల పంపకం జరపడం చూసాను. కానీ ఇలా అప్పులు పంచడం కాదు. అయినా అంత డబ్బు అప్పు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? చేసేముందైనా మమ్మల్నో మాట అడగొచ్చుగా'' కాస్త విసుగు ధ్వనించింది చక్రవర్తి గొంతులో.

"రెక్కలు వచ్చాయని అప్పు గురించి ఆరా తీస్తున్నావా చక్రీ! అప్పు ఎందుకు చేసానని ఇప్పుడడుగుతున్నావా? అప్పు చేయడం నాకు కొత్తేంకాదురా. నీకు గుర్తుందా నీ చిన్నతనంలో ఆక్సిడెంట్‌కి గురై చావుబ్రతుకుల్లో వుంటే హైదరాబాద్‌కి తరలించారు. అక్కడే ట్రీట్‌మెంట్‌కి, ఆపరేషన్‌కి చాలా డబ్బు అవుతుందన్నారు డాక్టర్లు. నిన్ను బతికించుకోవడం కోసం అప్పుడు అప్పే తెచ్చాను. కానీ ఇంత డబ్బెక్కడిది నాన్నా అని నువ్వొక్క మాట ఆ రోజు అడగలేదు.

ఇంటరయ్యాక నీ కోచింగ్‌లకి, లాంగ్‌టర్మ్‌లకి వేలకువేలు ఖర్చయింది. అయినా ర్యాంక్ తెచ్చుకోలేకపోయావు. ఇక్కడ సీటు దొరకలేదు. 'మా ఫ్రెండ్స్ అంతా డొనేషన్ కట్టి వేరే స్టేట్‌లో చదువుతున్నారని' నీవంటే 'డబ్బున్నవాళ్ళు, నా దగ్గర అంత స్థోమత లేదని' నేనన్నానని వారంరోజులు తిండి మానేసి అలక వహించావు. నీ ఆనందం కోసం, నీ బంగారు భవిష్యత్తుకోసం కర్నాటకలో సివిల్ ఇంజనీరింగ్‌లో జాయిన్ చేసాను. అప్పుడు కూడా అప్పు తెచ్చాను. ఈ ఇల్లు కూడా మీ తాతయ్య మిగిల్చిందే. ఈ ఇల్లు అయినా లేకుంటే అద్దెకొంపల్లో మగ్గుతూ మరెన్ని కష్టాలు అనుభవించేవాడినో? మరెంత అప్పులపాలయ్యేవాడినో!'' ఆవేశంగా చెప్పాడు రాఘవయ్య.

"మీరు అప్పులు చేశారని మమ్మల్నీ చేయమంటారా? నా పిల్లలు ఎదుగుతున్నారు. ఖర్చులు పెరుగుతున్నాయి. అంత డబ్బు సర్దమంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఇబ్బందే'' కరాఖండిగా చెప్పాడు చక్రవర్తి.

డబ్బుకి డబ్బు వుండి వేయడం తప్ప ఇతరులకి పైసా విదల్చడం అలవాటులేని చక్రవర్తి ఈ విషయంలో రాజీపడదల్చుకోలేదు. అందుకే స్పష్టంగా తన అభిప్రాయాన్ని తండ్రికి విన్పించాడు.

"మీ ఇష్టప్రకారమే కానీయండి నాన్నా అన్నయ్యా! అంతదానికే అంత సీరియస్ అవడమెందుకు? ఆ డబ్బేదో నేనే సర్దుతాను. కానీ ఒక్క షరతు. నాన్నగారు నా దగ్గరే ఉండాలి'' అన్నాడు సురేంద్ర.

"ఆ వంకన నెలనెలా ఆయనకొచ్చే పెన్షన్ డబ్బులు తీసేసుకుందామనా?'' గయ్‌మని అరిచింది ఘరిది మాటకు.

అరుంధతి బుద్ధి, మనసు ఆమెని నిలకడగా ఉండనీయలేదు.

రాఘవయ్య మనస్సు చివుక్కుమంది.

బదులుగా వేదవతి నోరెత్తబోయింది. అది గ్రహించి చెయ్యెత్తి భార్యని వారించాడు సురేంద్ర. మరి మాట్లాడలేదామె.

"అలాంటి ఆలోచనేంలేదు వదినా'' అని అరుంధతికి సమాధానమిచ్చి తండ్రివైపు చూస్తూ ఇలా అన్నాడు సురేంద్ర స్థిరంగా.

"ఆ పెన్షన్ డబ్బేలేవో నెలనెలా వాళ్ళకి పంపే ఏర్పాటు చేయండి నాన్నా. మీరు మాత్రం మాతో వచ్చేయండి.''

అన్నావదినల్లో కొంత అనుమానం.

తండ్రి వదనంలో ఆశ్చర్యం.

పసిగట్టాడు సురేంద్ర.

అందుకే మళ్ళీ పెదవి విప్పాడు.

"వృద్ధాప్యంలో మీ ఆలనా పాలనా చూడ్డం కొడుకులుగా మా బాధ్యత. కాదనను. అయితే మిమ్మల్ని నా దగ్గరే ఉండిపొమ్మనడంలో నా స్వార్థం కూడా కొంత వుంది నాన్నా. అది ఆర్థికపరమైనది మాత్రం కాదు'' అంటూ ఆగాడు.

రాఘవయ్య కనుబొమలు ముడివడ్డాయి.

అన్నయ్యా, వదిన, భార్య ఆసక్తిగా చూసారు.

వాళ్ళందర్నీ ఓమారు కలియజూసి మళ్ళీ తన ధోరణిలో తాను నెమ్మదిగా చెప్పుకుపోసాగాడు సురేంద్ర.

"నేను పుట్టకముందే నాన్నమ్మా, తాతయ్యలు చనిపోయారు. నేను వాళ్ళని మిస్సయ్యాను. కానీ నా పిల్లల విషయంలో అలా కాకూడదు. నా పిల్లలకు మీ సాన్నిధ్యం కావాలి. తాతగారు చెప్పే కబుర్లు, కథలు వాళ్ళు వినాలి. మీరందించే సంస్కృతి, సంస్కారం వాళ్ళకు అలవడాలి. మీ తరం అనుభవాల సంపుటులు వాళ్ళ అనుభూతికి ఆకృతులివ్వాలి. ఇదీ నా అంతరంగం. ఇక నిర్ణయం మీది'' అంటూ ముగించాడు.

'చిన్నకొడుకు ఆలోచనా సరళి హర్షణీయమే' అనుకున్న రాఘవయ్య హృదయం ఆనందంతో ప్రఫుల్లమయ్యింది.

★